సాక్షి
హనుమకొండ
శనివారం । 25 । ఫిబ్రవరి । 2023



టార్గెట్, వేధింపులే కారణం

పీజీ మెడికల్ విద్యార్థిని దరావత్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సీనియర్ విద్యార్థి సైఫ్ టార్గెట్, వేధింపులే కారణమని సీపీ ఏవీ.రంగనాథ్ తెలిపారు. - 8లో



కెమిస్ట్రీ పాత్ర కీలకం

సమాజంలో కెమిస్ట్రీ పాత్ర కీలకం అని సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిట్‌లో జాతీయ సదస్సు ఏర్పాటు చేశారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37^0 /19^0

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు వాతావరణం చాలా వేడిగా ఉంటుంది. సాయంత్రం చలి తీవ్రత ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్

కాజీపేట అర్బన్/కాశీబుగ్గ/సెంటర్: హనుమకొండ, వరంగల్ కలెక్టరేట్‌లలో శనివారం దివ్యాంగులకు ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నట్లు ఆయా జిల్లాల స్త్రీ,శిశు సంక్షేమాధికారులు సబిత, శారదలు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్ధులు తమ సమస్యల పరిష్కారానికి దరఖాస్తులు అందజేయాలని కోరారు.

27న నిధి ఆప్కే నికట్

హన్మకొండ అర్బన్: ఈపీఎఫ్ఓ సభ్యులు, యజమానులు, పెన్షనర్ల ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి ఈ నెల 27న వరంగల్ మున్సిపాలిటీ కమ్యూనిటీ హాల్‌లో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమం నిర్వహించనున్నట్లు రీజినల్ పీఎఫ్ కమిషనర్ ప్రణీత్‌జోషి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఎఫ్ సభ్యులు, యజమానులు, పెన్షనర్లు హాజరై వారి ఫిర్యాదులను పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు చెస్ పోటీలు

కాశిబుగ్గ: వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని, అదివారాల్లో రెండు రోజుల పాటు వరంగల్ ఓ సిటీ ఇండోర్ స్టేడియంలో అండర్-17 బాలబాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సీఈఓ జి.రజినీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల 17 ఏళ్లలోపు బాలబాలికలు శనివారం ఉదయం 10 గంటలలోగా ఓ సిటీ స్టేడియానికి రావాలని కోరారు. వివరాలకు 99483 32917, 91212 45666 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

డీఏఓ పరీక్షకు ఆర్టీసీ బస్సులు

హన్మకొండ: టీఎస్ పీఎస్సీ ఈ నెల 26న నిర్వహిస్తున్న డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పరీక్షకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'పెన్షనర్ల సెంట్రల్' జిల్లా కార్యవర్గం ఎన్నిక



హన్మకొండ అర్బన్: తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ హనుమకొండ జిల్లా శాఖ నూతన అధ్యక్షుడిగా ఎండీ సర్వర్ ఉసేన్, కార్యదర్శిగా ఆర్.గోవర్ధన్‌లు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కూచన వెంకటనారాయణ శుక్రవారం తెలిపారు. ఉపాధ్యక్షుడిగా ఎం.సారయ్య, సంయుక్త కార్యదర్శిగా ఎం.నరేంద్రచారి, కార్యనిర్వాహక కార్యదర్శిగా బి.సతీష్, ప్రచార కార్యదర్శిగా బి.ధర్మరాజు, సాంస్కృతిక కార్యదర్శిగా బి.మనోరమ, కోశాధికారిగా ఎస్.మల్లికార్జున్‌లు ఎన్నికైనట్లు వివరించారు. ఈసీ మెంబర్లుగా ఏఏ.మహబీన్ ఇక్బాల్, జి.సీతారాములు, ఎం.నరేందర్‌రెడ్డి, వెంకటయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ ఉపాధ్యక్షుడు పిండి సారంగపాణి, కార్యదర్శి పెసరు సారంగపాణి, ఈసీ మెంబర్ ఆఫీజుద్దీన్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు కె.ఉప్పలయ్య, కార్యదర్శి కిషన్ పాల్గొన్నారు.

భీమారం చెరువు సర్వే



సాక్షి ఎఫెక్ట్

హసన్‌పర్తి: నగరంలోని 55వ డివిజన్ భీమారం శ్యామల చెరువు సర్వే ప్రారంభమైంది. 'రూ.30 కోట్ల చెరువు శిఖం కబ్జా' శీర్షికన 'సాక్షి'లో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఉన్నతాధికారులు స్పందించడంతో స్థానిక ఏఈ శ్రీనివాస్ ఆధ్వర్యంలో బృందం డిజిటల్ సర్వే చేపట్టింది. రెండురోజుల్లో సర్వే పూర్తవుతుందని అధికారులు తెలిపారు. తొలిరోజు చేపట్టిన సర్వే ఆధారంగా చెరువు శిఖం కబ్జాకు గురైనట్లు తెలిసింది. నిర్మాణాలు కూడా వెలిసినట్లు అధికారులు గుర్తించారు. సర్వే పూర్తయితే ఎన్ని ఎకరాలు కబ్జా అయ్యిందో స్పష్టత వస్తుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

అసైన్డ్ భూమి సర్వేకు ఆదేశం

దేవన్నపేట శివారులోని సర్వే నంబర్ 130లో అసైన్డ్ భూమిని సర్వే చేయాలని స్థానిక తహసీల్దార్ ఆదేశించారు. 'అసైన్డ్ భూమిలో వెంచర్' శీర్షికన గురువారం సాక్షిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పందించి పూర్తి నివేదికను అందించాలని తహసీల్దార్ బండి నాగేశ్వర్‌రావును ఆదేశించారు. ఈ మేరకు అసైన్డ్ భూమి సర్వేకు సర్వేయర్‌కు మెమో జారీ చేశారు. వారం రోజుల్లో నివేదిక అందించాలని ఆదేశించారు.

ప్రీతి ఘటనలో.. హైడ్రామా

విచారణలో ఎంజీఎం పరిపాలన అధికారుల వింత వైఖరి

- బాధితురాలి తండ్రి ఆవేదనను పట్టించుకోకుండా మాట్లాడిన వైనం
- పీజీ విద్యార్థుల ఆందోళన వెనుక అనుమానాలెన్నో..
- సీపీ రంగనాథ్ ప్రెస్‌మీట్‌తో వెలుగుచూసిన అసలు నిజాలు..



ఎంజీఎంలో ఆందోళన చేస్తున్న వైద్య విద్యార్థులు

ఎంజీఎం : వైద్య విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సమయం నుంచి ఎంజీఎం పరిపాలనా అధికారుల తీరు వివాదాస్పదంగా ఉంటోంది. ఘటన వెలుగు చూసిన రోజు నుంచి ఓ రకంగా మాట్లాడుతూ ఎవరినో రక్షించే ప్రయత్నంలో ఉన్నారన్న భావన కల్పిస్తున్నారు. విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రోజు సీనియర్ విద్యార్థి వేధింపులు కారణమని తండ్రి తీవ్ర దుఃఖంతో జరిగిన ఘటనను వివరిస్తే.. దానిని ఏ మాత్రం పట్టించుకోకుండా ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్‌తో పాటు పలువురు అధికారులు ఆ ఆరోపణలను ఒప్పుకునేది లేదంటూ ఏకంగా పత్రిక సమావేశంలో వెల్లడించారు. శుక్రవారం పలు మీడియాలకు ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూల్లో సైతం అదే విషయాన్ని వెల్లడిస్తూ వచ్చారు. ఓ పక్క ఆరోపణలపై విచారణ సాగిస్తామని పేర్కొంటూ.. విధుల్లో ఇలాంటివి సర్వసాధారణమేనన్న వైఖరితో ముందుకు సాగడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంజీఎం అంతర్గత విచారణ కమిటీపై నమ్మకంలేదనే వాదన అటు బాధితులనుంచి. ఇటు పలు సంఘాలనుంచి వస్తున్న క్రమంలో పోలీసులు విచారణ ముమ్మరం చేశారు. చివరికి పోలీస్ కమిషనర్ రంగనాథ్ ప్రీతిని సీనియర్ విద్యార్థి సైఫ్ వేధించిన విషయం నిజమేనని అధికారికంగా చెప్పడంతో ఎంజీఎం అధికారులు ఒక్కసారిగా కంగుతిన్నారు.

విద్యార్థుల ఆందోళనపై పలు అనుమానాలు..

రెండు రోజులుగా ప్రీతి ఆరోగ్యం క్షీణిస్తూ వస్తున్న క్రమంలో సైఫ్‌కు వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నాయకులు, గిరిజన సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ఆందోళనలు చేస్తున్నాయి. అధికారుల తీరుపై దుమ్మెత్తిపోస్తున్నాయి. కానీ కొంతమంది అధికారులు కొత్త ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. ఏకంగా విద్యార్థుల చేత సైఫ్‌కు అనుకూలంగా విధులు బహిష్కరింపజేసి ఆందోళనకు దిగేలా చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొదట పూర్తిస్థాయిలో సైఫ్‌కు అనుకూలంగా వ్యవహరించిన విద్యార్థులు ప్రీతి జరిగిన అన్యాయంపై పలువురు ప్రశ్నలతో నిలదీయడంతో నిజాలు వెలుగుచూడాలనే అనే వాదనతో ఆందోళనకు దిగామని వెనకడుగు వేశారు. చివరి క్షణంలో ప్రీతి, సైఫ్ ఇద్దరు మా వైద్యవిద్యార్థులేనని, అసలు నిజాలు వెలుగులోకి రావాలనే ఈ ఆందోళనకు వెళ్లినట్లు పేర్కొనడం గమనార్హం.

ఎంజీఎంలో దర్యాప్తు అనంతరం బయటికి వస్తున్న సీపీ రంగనాథ్, పోలీసులు



ఎంజీఎం ఆస్పత్రిలో సీపీ దర్యాప్తు..

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సంబంధించిన వివరాలు వెల్లడించే ముందు గురువారం ఉదయం సీపీ రంగనాథ్ స్వయంగా ఎంజీఎం ఆస్పత్రికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అసలు ఘటన జరగడానికి గల కారణాలు.. విధుల విషయంలో ఏరకంగా సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య సమన్వయం.. అజమాయిషీ ఏవిధంగా ఉంటుంది.. సీనియర్‌లను జూనియర్‌లు ఏవిధంగా పిలవాలనే అనే అంశాలపై ఎంజీఎం సూపరింటెండెంట్ చంద్రశేఖర్, కేఎంసీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌తో చర్చించారు. సీనియర్ వేధింపు ఘటనపై ఏ రకంగా కౌన్సెలింగ్ నిర్వహించారు..అనే దానిపై ఆరాతీశారు. సుమారు గంటపాటు పలు అంశాలపై దర్యాప్తు జరిపిన అనంతరం కమిషనర్ కార్యాలయంలో ప్రీతి ఘటనపై వివరాలు వెల్లడించారు.

పలు ప్రశ్నలకు చెక్ పెట్టిన సీపీ

ఎంజీఎం ఆస్పత్రి అధికారులు, ఇటు వైద్యవిద్యార్థులు సైఫ్ విధుల్లో భాగంగానే ఆమెపై ఒత్తిడి తెచ్చారని, ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని వాదిస్తున్న క్రమంలో సాంకేతిక కారణాలతో పోలీస్ కమిషనర్ రంగనాథ్ వెల్లడించిన వివరాలతో అసలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. ప్రీతిని ఎవరూ సమర్థించవద్దని 31మంది ఉన్న గ్రూపులో సైఫ్ పేర్కొనడంతోపాటు వ్యక్తిగతంగా మెసేజ్‌లతో వేధింపులకు గురి చేసినట్లు పేర్కొన్నారు. ప్రీతికి జరిగిన వేధింపులపై కౌన్సెలింగ్‌లో సైతం న్యాయం జరగకపోవడం వల్లే మానసికంగా తీవ్ర ఆందోళన చెందినట్లు తెలుస్తోంది.

గత ఘటనల్లోనూ ఇదే వైఖరి..

ఎంజీఎం ఆస్పత్రిలో గతంలో ఇద్దరు అనస్తీషియా వికటించి మృతిచెందిన ఘటనల్లోనూ ఎంజీఎం పరిపాలనాధికారులు ఇదే వైఖరితో వ్యవహరించారు. అంతర్గత విచారణ పేరుతో బాధితులకు చేసిన న్యాయం శూన్యమన్న వాదన వినిపిస్తోంది. చివరకు వెయ్యి, వందల మందిలో ఒకరికి ఈ డ్రగ్ ఇలా రియాక్షన్ జరుగుతుందని పేర్కొంటూ చాకచక్యంగా ఆ విచారణను డీఎంఈ స్థాయి అధికారి చేతిలో పెట్టి చేతులు దులుపుకున్నారు. పరిపాలనలో జరిగే లోపాలను తమకు అనుకూలంగా మలుచుకుంటూ పేదరోగులకు అన్యాయం చేస్తున్నారన్న అపవాదును మూటగట్టుకుంటున్నారు.

వేధింపులే ఆత్మహత్యాయత్నానికి కారణం

- సైఫ్ వాట్సాప్ చాటింగ్ ఆధారంగా నిర్ధారణ
- నిందితుడి అరెస్టు..రిమాండ్‌కు తరలింపు
- సీపీ ఏవీ రంగనాథ్ వెల్లడి - వరంగల్ క్రైం - 8లో

పీజీ విద్యార్థుల ఆందోళన

- వివక్ష, అసమానతలు లేవని ప్లకార్డులు - 8లో
- సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీస్
- ఇబ్బందులు లేకుండా చర్యలు: సూపరింటెండెంట్ - ఎంజీఎం

హనుమకొండ, వరంగల్‌లో రాహువు, కేతువులు



సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్

హన్మకొండ: హనుమకొండ, వరంగల్‌లో రాహువు, కేతువులు దాపురించారని, ఖాళీ జాగా కనిపిస్తే కబ్జాలే వీరి పని అని పరోక్షంగా స్థానిక ఎమ్మెల్యేలను ఉద్దేశించి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్ ధ్వజమెత్తారు. 'ప్రజా గోస-బీజేపీ భరోసా'లో భాగంగా శుక్రవారం హనుమకొండ కేయూ క్రాస్ రోడ్డులో జరిగిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్ మాట్లాడారు. రూ.100 కోట్ల విలువ చేసే దాసాంజనేయ దేవాలయం స్థలాన్ని కబ్జా చేయాలని చూస్తున్నారని, ఎన్ని కబ్జాలు చేసినా, ఫాం హౌజ్‌లు కట్టినా ఇంకా మూడు నెలలు మాత్రమే అని అన్నారు. వచ్చేది బీజేపీ ప్రభుత్వమని, భూములకు రక్షణ కల్పిస్తామన్నారు. వరంగల్ మహానగరంలో వరదలు వస్తే పట్టించుకోలేదన్నారు. స్మార్ట్ సిటీ నిధులు పంపిస్తే దారి మళ్లించారని, హైదరాబాద్‌లో స్మార్ట్‌సిటీపై సమావేశం ఏర్పాటు చేస్తే అందులో తాను నిలదీస్తే నిధులు మంజూరు చేశారని, అయినా రాష్ట్ర వాటా చెల్లించలేదని విమర్శించారు. కేఎంసీలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తే రాష్ట్ర వాటా ఇవ్వకుండా ఆ ఆస్పత్రిని ప్రారంభించడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, నాయకులు చాడా శ్రీనివాస్‌రెడ్డి, సదానందం, తాళ్లపల్లి కుమార స్వామి, గురుమూర్తి శివకుమార్‌పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లవ్ జిహాదీ వంటిదే..

వైద్య విద్యార్థి ప్రీతి ఆత్మహత్యాయత్నం లవ్ జిహాదిలాంటిదేనని బండి సంజయ్ ఆరోపించారు. లవ్ జిహాదీలు ప్రీతి తండ్రిని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ప్రీతి బతకాలని కోరుకుంటున్నానన్నారు. ఈ ఘటనపై తప్పుడు ప్రచారం చేస్తూ ర్యాగింగ్ చేసిన వ్యక్తిని హీరో చేస్తున్నారని ధ్వజమెత్తారు. ర్యాగింగ్ పేరుతో వేధిస్తే పోలీసులు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వం స్పందించడం లేదని అమ్మాయి తండ్రి చెబుతున్నారన్నారు.

3న న్యాయవాదుల కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

వరంగల్ లీగల్: వరంగల్ న్యాయవాదులు కోఆపరేటివ్ సొసైటీలో 2023-2024 సంవత్సరానికి గాను నాలుగు డైరెక్టర్ల పోస్టులకు ఎన్నికలను మార్చి 3న నిర్వహించనున్నట్లు సొసైటీ కార్యదర్శి బిల్లా ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 27 ఎన్నికల నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినింగ్, 28న విత్‌డ్రాలు, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, మార్చి 3న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్, 6 గంటలకు కౌంటింగ్, విజేతల ప్రకటన ఉంటుందని వివరించారు. ఎన్నికల అబ్జర్వర్లుగా న్యాయవాదులు డి.ప్రేమ్‌సాగర్, పి.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ భాగ్యమ్మ, సీహెచ్ చిదంబర్నాథ్‌లను నియమించినట్లు వివరించారు.

న్యాయవాది రంజిత్ 6 ఏళ్ల సస్పెన్షన్

వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ విభజన అంశంపై న్యాయవాదులను తప్పుదోవ పట్టించే విధంగా ప్రవర్తించాడని తప్పుపడుతూ న్యాయవాది రంజిత్‌కు బార్ అసోసియేషన్ షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీనిపై ఇచ్చిన సమాధానం సంతృప్తికరంగా లేకపోవడంతోపాటు పలువురిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరు సంవత్సరాల పాటు అసోసియేషన్‌నుంచి అతన్ని సస్పెండ్ చేసినట్లు అధ్యక్షుడు ఆనంద్‌మోహన్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. శుక్రవారం హనుమకొండలోని ప్రభుత్వ మార్కజీ, ప్రాక్టిసింగ్ పాఠశాలల్లో విద్యార్థులకు అభ్యసన దీపికలు, ఎగ్జామ్స్‌కిట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. మన ఊరు – మన బడి, మన బస్తీ – మన బడి పథకం ద్వారా పాఠశాలల్లో మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. మార్కజీ హైస్కూల్‌లో టెన్త్ ఫలితాల్లో మొదటి మూడుస్థానాలు సాధించిన వారికి నగదు బహుమతులు అందజేస్తామన్నారు. పిల్లలతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈఓ ఎండీ అబ్దుల్‌హై, హెచ్‌ఎంలు ఉమ, ప్రభాకర్, కార్పొరేటర్ చెన్న మధు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, అధికారులు

హన్మకొండ అర్బన్: ప్రభుత్వ లక్ష్యాలను త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి జిల్లా కలెక్టర్లు, అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి శాంతికుమారి, మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటి వెలుగు, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం, 58, 59, 76 ప్రభుత్వ జీఓల ప్రకారం చేయాల్సిన క్రమబద్ధీకరణ, పోడు భూములు, ఆయిల్‌పామ్ సాగు, తదితర అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎఫ్ఓ వసంత, డీటీడబ్ల్యూ ప్రేమకళారెడ్డి, డీఎంహెచ్ఓ సాంబశివరావు, డీఆర్ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాములు పాల్గొన్నారు.

కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

హసన్‌పర్తి: హనుమకొండ జిల్లావ్యాప్తంగా ఆర్టీఏ అధికారులు స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు 5,316 వాహనాలు త్రైమాసిక ట్యాక్స్‌లు చెల్లించలేదని ఆర్టీఏ అధికారులు గుర్తించారు. నాలుగు రోజులుగా 400కుపైగా వాహనాలను తనిఖీ చేశారు. సుమారు 300కుపైగా వాహనాలను త్రైమాసిక ట్యాక్స్‌లు చెల్లించలేదని గుర్తించి సీజ్ చేశారు. వాహనదారుడినుంచి సంబంధిత పత్రాలతోపాటు ఫోన్ స్వాధీనం చేసుకుంటున్నారు. పైరవీలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఫోన్‌ను స్వాధీనం చేసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ట్యాక్స్‌తోపాటు ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల మేరకు 200శాతం పెనాల్టీ విధిస్తున్నారు. వరుసగా ఆరు త్రైమాసిక ట్యాక్స్‌లు చెల్లించని వాహనాల రిజిస్ట్రేషన్ రద్దు చేస్తున్నట్లు డీటీసీ పురుషోత్తం తెలిపారు. వాహన యజమానులు వెంటనే చెల్లించాలని సూచించారు.

సభ విజయవంతానికి కృషి చేయాలి

ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కడియం శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్: వేలేరు మండలం సోడషపల్లి గ్రామంలో రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ఈ నెల 27న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన రైతు ధన్యవాద సభ విజయవంతానికి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులందరూ సమష్టిగా పనిచేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి పిలుపునిచ్చారు. ధర్మసాగర్, వేలేరు మండలాల్లో శుక్రవారం నిర్వహించిన బీఆర్ఎస్ సన్నాహక సమావేశాల్లో ఆయన మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి దేశ రాజకీయాలను మలుపు తిప్పబోతున్నదన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ సునాయసంగా గెలిచే సీటు స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గమని అన్నారు. అందరం కలిసి పనిచేస్తే గెలుపు అనేది నల్లేరుపై నడకేనన్నారు. అధికారంలో, ప్రజాప్రతినిధులుగా ఉన్నప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని, మనల్ని వేలకళ్లు చూస్తూ ఉంటాయి కాబట్టి ఒళ్లు దగ్గరపెట్టుకొని పని చేయాల్సిన అవసరముందన్నారు. అప్పుడే పార్టీ, ప్రభుత్వ పరువు బాగుంటుందని పేర్కొన్నారు. 27న నిర్వహించే బహిరంగ సభకు ధర్మసాగర్ మండలం నుంచి దాదాపు 6వేల మందికిపైనే హాజరు కావాలన్నారు. రాష్ట్ర రైతుబంధు సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని చిల్పూర్, వేలేరు, ధర్మసాగర్ మండలాల్లోని ఎత్తయిన గ్రామాలకు సాగునీరు అందించేందుకు రూ.103 కోట్ల అంచనా వ్యయంతో మూడు లిఫ్టులకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అధ్యక్షత వహించగా దివ్యాంగుల సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి, కుడా చైర్మన్ సుందర్‌రాజ్, పీఏసీఎస్ చైర్మన్ గున్‌రెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీలు నిమ్మ కవిత, కేసిరెడ్డి సమ్మిరెడ్డి, జెడ్పీటీసీలు పిట్టల శ్రీలత, సరిత, ధర్మసాగర్ సర్పంచ్ శరత్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతుల రక్తం చూసిన ప్రభుత్వమిది..

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే : ఈటల రాజేందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

భీమదేవరపల్లి: గౌరవెల్లి ప్రాజెక్టులో సర్వం కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వకుండా ఇదేమిటని ప్రశ్నించిన రైతులపై లాఠీచార్జ్ చేసి వారి రక్తాన్ని చూసిన ప్రభుత్వానికి పతనం తప్పదని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో పార్టీ నియోజకవర్గ నాయకుడు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వివిధ పార్టీల నుంచి బీజేపీలో చేరగా వారికి ఈటల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ ఎస్సారెస్పీ పాఠశాలలో జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో రాజేందర్ మాట్లాడుతూ కేసీఆర్‌వి అన్ని అబద్ధాల మాటలేనని, నాడు ఉద్యమ సమయంలో చెప్పిన విషయాలకు, నేడు అసెంబ్లీలో చెబుతున్న మాటలకు అసలు పొంతనలేదన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, రైతు రుణమాఫీ, నిరుద్యోగ భృతి లాంటి అనేక హామీలు ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రాబోయేది రాష్ట్రంలో ఏర్పడేది బీజేపీ ప్రభుత్వమేనని, హుస్నాబాద్‌లో కాషాయ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, చాడ శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ శ్రీరాం, పైడిపల్లి పృథ్వీరాజు, మాచర్ల కుమారస్వామి, ఊసకోయిల ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి

ఆత్మకూరు: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ హిమబిందు కోరారు. సెంట్రల్ టీబీ డివిజన్ అదేశాల మేరకు నిక్షయ్ దివస్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆత్మకూరు పీహెచ్‌సీ పరిధిలోని తిరుమలగిరిలోని కేజీబీవీ పాఠశాలలో నిర్వహించారు. టీబీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హిమబిందు మాట్లాడుతూ ప్రతినెలా 24వ తేదీన నిక్షయ్ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2025 సంవత్సరానికల్లా క్షయ నిర్మూలన ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. టీబీ లక్షణాలు.. ఎలా వ్యాపిస్తుంది, దానిని వ్యాప్తి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రతలపై పిల్లలకు అవగాహన కల్పించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ స్పందన మాట్లాడుతూ పరిశుభ్రతతో పాటు తల్లిదండ్రులకు టీబీపై అవగాహన, ఎలా ఉండాలో.. దాని లక్షణాల గురించి వివరించారు. ×టీబీ నిర్మూలన, మనందరి బాధ్యత¥ అనే అంశం పై విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ల్యాబ్ సూపర్‌వైజర్ రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, కేజీబీవీ ప్రిన్సిపాల్ వాసవి, సీఆర్‌టీలు, హెచ్‌వి నర్మద, ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

టార్గెట్, వేధింపులే కారణం

- సైఫ్ వాట్సాప్ చాటింగ్ ఆధారంగా నిర్ధారణ
- అరెస్టు..రిమాండ్‌కు తరలింపు
- సీపీ ఏవీ రంగనాథ్ వెల్లడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించిన కేఎంసీ మెడికల్ పీజీ విద్యార్థిని డాక్టర్ దరావత్ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సీనియర్ విద్యార్థి సైఫ్ చేసిన వేధింపులే కారణమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రీతి ఆత్మహత్యాయత్నానికి సంబంధించి కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలతో మాట్లాడి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రీతి తెలివిగల అమ్మాయి అని ఇటీవల వైద్య విభాగానికి సంబంధించి యూపీఎస్సీ ఇంటర్వ్యూ కూడా అటెండ్ చేసిందన్నారు. కేఎంసీలో ర్యాగింగ్ కంటే బాసిజం ఎక్కువగా ఉందని జూనియర్ విద్యార్థులు సీనియర్లను సార్ అనే సంస్కృతి ఇక్కడ కొనసాగుతుందని పేర్కొన్నారు. సార్ అనే సంస్కృతి అన్ని మెడికల్ కళాశాలల్లో ఉన్నట్లు తెలిసిందని తెలిపారు.

టార్గెట్ వేధింపులే..ర్యాగింగ్..

ప్రీతి ఆత్మహత్యాయత్నానికి కారణమైన సైఫ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుతో పాటు ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించడం, ర్యాగింగ్ నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్లు సీపీ తెలిపారు. నిందితుడు సైఫ్, ప్రీతి ప్రశ్నించేతత్వాన్ని తట్టుకోలేక ఉద్దేశ్యపూర్వకంగా టార్గెట్ చేసి వేధించినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయినట్లు తెలిపారు. ప్రీతిని ఈనెల 18న ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో రోగికి అనస్తీషియా ఇచ్చిన అనంతరం కేస్ షీట్‌లో ప్రీతి రాయకుండా హౌజ్ సర్జన్ విద్యార్థితో కేస్ షీట్ రాయించడాన్ని తీవ్రంగా పరిగణించి సైఫ్ ఆ విషయంపై అవమానకరంగా మాట్లాడినట్లు తెలిపారు. జూనియర్, సీనియర్ విద్యార్థులతో ఉన్న వాట్సాప్ గ్రూప్‌లో అవమానించే విధంగా పోస్టింగ్ పెట్టినట్లు తెలిపారు. దీనికి ప్రీతి స్పందించి సైఫ్‌కు పర్సనల్‌గా 'నీ పని నువ్వు చూసుకో.. నా విషయంలో జోక్యం చేసుకోవద్దని' మెసేజ్ చేసినప్పటికి తన పద్ధతి మార్చుకోలేదని తెలిపారు. ఈనెల 19న కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్ సైఫ్‌తో మాట్లాడి హెచ్చరించినట్లు పేర్కొన్నారు. ప్రీతి తనను సైఫ్ అనే విద్యార్థి వేధిస్తున్నట్లు తన తండ్రి ఆర్‌పీఎఫ్‌లో పనిచేసే ఏఎస్సై నరేందర్‌కు విషయం చెప్పినట్లు తెలిపారు. దీంతో నరేందర్ ఈనెల 20న కళాశాలకు వచ్చి ప్రీతితో మాట్లాడినట్లు ఆయన చెప్పారు. 21న అనస్తీషియా విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ నాగార్జునరెడ్డి సైఫ్, ప్రీతిలతో వేర్వేరుగా మాట్లాడి ఇక మీదట డ్యూటీలు వేర్వేరుగా వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు. 21న రాత్రి 3 గంటల సమయంలో శైలేష్ అనే విద్యార్థితో సైఫ్ వేధిస్తున్నట్లు చెప్పడంతో పాటు తనకు ఎవరూ సపోర్టు చేయడం లేదని మాట్లాడినట్లు తెలిసిందని ఆయన తెలిపారు.

ఫోన్లే కీలకం...

ప్రీతి ఆత్మహత్యాయత్నం ఘటనలో ప్రీతి, సైఫ్ సెల్‌ఫోన్లే విచారణలో కీలకంగా మారాయి. ప్రీతి తన స్నేహితులతో సైఫ్ తరుచుగా వేధిస్తున్నట్లు చేసిన చాటింగ్‌తో పాటు సైఫ్ కూడా తన స్నేహితులతో ప్రీతికి ఎవరు కూడా ఎటువంటి సహాయం చేయవద్దని పలుమార్లు ఆమెను టార్గెట్ చేసి తన స్నేహితులతో పంచుకున్న చాటింగ్‌ను సేకరించినట్లు సీపీ రంగనాథ్ తెలిపారు. ప్రీతి ఆత్మహత్యాయత్నానికి ముందు గూగుల్‌లో పలు ఇంజక్షన్ల గురించి సెర్చ్ చేసినట్లు తెలిసిందని తెలి పారు. ఉదయం 7 నుంచి 7.30 గంటల మధ్యలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండవచ్చని సీపీ పేర్కొన్నారు.

స్పందించిన పోలీసులు

ఈనెల 20న హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చిన ప్రీతి తండ్రి నరేందర్ సదానందం అనే కానిస్టేబుల్ సహకారంతో వరంగల్ ఏసీపీ బోనాల కిషన్‌ను ఫోన్‌లో సంప్రదించగా రేవంత్‌రెడ్డి పాదయాత్రకు సంబంధించిన సమావేశంలో ఉన్నందున ఫోన్ ఎత్తలేదని ఆ తర్వాత వచ్చిన మెసేజ్ అధారంగా తిరిగి మాట్లాడినట్లు తెలిపారు. మట్టెవాడ ఎస్సై శంకర్‌నాయక్ తనకు ఫోన్ రాగానే విషయం కేఎంసీ ప్రిన్సిపాల్‌తో మాట్లాడినట్లు సీపీ తెలిపారు. ఈ సంఘటనను పోలీసులు ఎక్కడా నిర్లక్ష్యంగా వ్యవహరించలేదన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు ఉంటాయనడానికి రెండున్నర నెలల్లో 12 మందిని సస్పెండ్ చేయడమే నిదర్శనమన్నారు. పోలీసుల స్పందనపై స్వయంగా తానే ప్రీతి తండ్రి నరేందర్‌తో మాట్లాడగా పోలీసులు స్పందించారని తెలిపినట్లు సీపీ తెలిపారు.

రాజకీయ రంగు పులమద్దు..

నిందితుడు సైఫ్‌కు ఎలాంటి రాజకీయ బలం లేదని, కాజీపేట బాపూజీ నగర్‌లో సాధారణ రైల్వే ఉద్యోగి కుటుంబం అన్నారు. సోషల్ మీడియాలో రకరకాలుగా ఈ ఘటనకు రాజకీయ రంగును పులిమే ప్రయత్నాలు జరుగుతున్నాయని దీంతో పోలీసుల దర్యాప్తుపై అనుమానాలు కలుగుతాయన్నారు. ఇది మంచి పద్ధతి కాదని రాసేటప్పుడు ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని సీపీ సూచించారు. విలేకరుల సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ బారీ, వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, ఎస్‌బీ ఏసీపీ తిరుమల్, ఇన్‌స్పెక్టర్లు మల్లేష్, సతీష్‌బాబు పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తాం



ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎంజీఎం : ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్‌ఎఫ్‌ఐ పోరాటం చేస్తుందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మిశ్రాన్ సుల్తాన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ హన్మకొండ, వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కేఎంసీ కళాశాల గేటు ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా మిశ్రాన్‌సుల్తానా, వరంగల్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం కేఎంసీలో ప్రీతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి నిమ్స్‌లో చికిత్స పొందుతుందన్నారు. ఈ సందర్భంగా రాస్తారోకో చేసిన నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్కా ప్రశాంత్, కేడీసీ కళాశాల అధ్యక్షకార్యదర్శులు రాజశేఖర్, అభిలాష్, రాజ్‌కుమార్, సందీప్, ఇర్ఫాన్, శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో పీజీ విద్యార్థుల ఆందోళన

ఎంజీఎం : ప్రీతికి న్యాయం చేయండి.. కాదనడం లేదు.. సైఫ్‌పై ఆధారాలు లేకుండా నిరాధారణ ఆరోపణలు చేయవద్దంటూ ఎంజీఎం ఆస్పత్రిలోని పీజీ వైద్యులు శుక్రవారం ఆందోళన బాటపట్టారు. ఈ ఘటనలో నిజనిర్ధారణలు వెంటనే తేల్చాలని డిమాండ్ చేస్తూ ఎంజీఎం సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేసి విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత రెండు, మూడు రోజులు సైఫ్ పీజీ సెకండీయర్ విద్యార్థి డ్యూటీ పరంగానే జూనియర్ విద్యార్థికి తెలిపాడే తప్ప ఎలాంటి వేధింపులకు గురిచేయలేదని పేర్కొన్నారు. కేఎంసీ, ఎంజీఎం ఆస్పత్రిలో ఎలాంటి వివక్షలు లేవని పేర్కొన్నారు.

విద్యార్థులు సమ్మె నోటీసు అందించారు.: సూపరింటెండెంట్ చంద్రశేఖర్

సైఫ్‌పై నిరాధారమైన ఆరోపణలు వస్తున్నాయని పీజీ విద్యార్థులు సమ్మె నోటీసు అందించి విధులు బహిష్కరించి ఆందోళన బాటపట్టారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఇబ్బంది కలుగకుండా హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించి అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు విధులకు హాజరు కావాలని సూచించాం. ఏకపక్షంగా విధులు బహిష్కరించడ సమంజసం కాదని, నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపామని విద్యార్థులకు సూచించాం.

నేడు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కొదిరిపాక సారంగపాణి తెలిపారు. ఈ నెల 25, 26 తేదీల్లో జరిగే పోటీలకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్‌తో పాటు డబుల్ ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత శోభ జేజే హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో 100, 200, 400, 800, 1500, 3000 పరుగుతో పాటు లాంగ్‌జంప్, హైజంప్, హ్యామర్‌త్రో, జావెలిన్‌త్రో, డిస్కస్‌త్రో ఈవెంట్లలో పోటీలు ఉంటాయని వివరించారు.

క్లుప్తంగా

సమాజంలో కెమిస్ట్రీ పాత్ర కీలకం

- సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కాజీపేట అర్బన్: సమాజంలో కెమిస్ట్రీ పాత్ర కీలకమైందని సీఎస్ఐఆర్ ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిట్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో శుక్రవారం నిట్ కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ఇనార్గానిక్ అండ్ ఆర్గానోమెటలిక్ కెమిస్ట్రీ(ఆర్ఏడీఐవోసీ–2023) అంశంపై ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మానవ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, మానవ సంక్షేమానికి కెమిస్ట్రీ రంగం దోహదపడుతుందని అన్నారు. కెమిస్ట్రీ విభాగం మల్టీడిసిప్లినరీ, అన్ని కోర్సుల్లో ప్రాథమికమైందని, నిట్‌లో అత్యాధునిక సౌకర్యాలతో కెమిస్ట్రీ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సు సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు లక్ష్మారెడ్డి, రామానుజాచారి, జొన్నలగడ్డ, జగన్నాథస్వామి తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు రాజేష్

పరకాల: మండలంలోని కామారెడ్డిపల్లె గ్రామంలో 2015 సంవత్సరంలో ఓ మహిళ హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు విధిస్తూ జిల్లా జడ్జి కృష్ణమూర్తి శుక్రవారం తీర్పును వెలువరించారు. వివరాలోకి వెళితే.. కామారెడ్డిపల్లెకు చెందిన తిక్క లలితను అదే గ్రామానికి చెందిన కొయ్యడ రాజేష్ కిరోసిన్ పోసి నిప్పటించాడు. తీవ్ర గాయాలపాలైన మహిళ ప్రాణాలు కోల్పోయింది. హత్య గురైన మృతురాలి కుమారుడు తిక్క దిలీప్ ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడిపై అప్పటి పోలీసు అధికారులు 380 సెక్షన్ నమోదు చేశారు. నిందితుడైన రాజేష్ మహిళ హత్యకేసులో దోషిగా తేలడంతో రూ.1000 జరిమానాలతో పాటు జీవిత ఖైదును విధించింది. కోర్టు పిలిచిన సమయంలో ఉన్న ప్రతిసారి సాక్షులను కోర్టుకి తీసుకెళ్లి నిందితుడికి శిక్షపడేందుకు విచారణ అధికారి ప్రస్తుత సీఐ కిషన్, కోర్టు కానిస్టేబుల్స్ సుధాకర్, చంద్రశేఖర్‌లు చేసిన కృషిచేయడం వలనే నిందితుడికి యావజీవ కారాగార శిక్షతో పాటు జరిమానా పడినందుకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



కీచక ఉపాధ్యాయులు

- విద్యార్థినులపై లైంగిక వేధింపులు
- మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ఆలస్యంగా వెలుగు చూసిన వైనం
- తల్లిదండ్రుల ఆందోళన



విలేకర్లతో మాట్లాడుతున్న విద్యార్థినుల పేరెంట్స్

మరిపెడ : విద్యాబుద్ధులు నేర్పాల్సిన గురువులే తమ కూతురులాంటి చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తించి లైంగిక వేధింపులకు పాల్పడడం తల్లిదండ్రులను కలవరపెట్టింది. ఉపాధ్యాయులతో పాటు పాఠశాల వాచ్‌మెన్, స్కూల్ బస్సుడ్రైవర్ కూడా ఇందులో తీసిపోలేదు. తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకుని వారిని నిలదీశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో శుక్రవారం చోటుచేసుకుంది. తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం .. స్థానిక సెయింట్ అగస్టీయన్ పాఠశాలలోని ఉపాధ్యాయులు ఖదీర్, రవి, పీఈటీ రాంబాబు, బస్సు డ్రైవర్ బిచ్చు, వాచ్‌మెన్ శ్రీను కొన్నిరోజులుగా విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. గురువులకు భయపడి వారు తల్లిదండ్రులకు చెప్పుకోలేక కొంత కాలంగా వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల ఓ విద్యార్థిని పట్ల అసభ్యంగా చేయడంతో ఎదురు తిరిగింది. చివరకు మిగతా పిల్లలుకూడా తల్లిదండ్రులకు చెప్పడంతో శుక్రవారం వారు పాఠశాలకు చేరుకుని కీచక ఉపాధ్యాయులను నిలదీశారు. ఓ ఉపాధ్యాయుడిపై చేయి చేసుకోవడంతో పోలీసులు అక్కడికి చేరుకుని మిగతావారిని బయటికి తీసుకెళ్లారు. కాగా, కీచక ఉపాధ్యాయులపై యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే వారినే వెనుకేసుకొస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సంఘటనా స్థలానికి ఎస్సై ఝాన్సీ చేరుకొని విద్యార్థులతో మాట్లాడారు.

ఫిర్యాదు అందిన వెంటనే చర్యలు చేపడతాం

తల్లిదండ్రుల ఫిర్యాదు అందించిన వెంటనే నిందితులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ సాగర్ తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన పీఈటీ

కరీమాబాద్ : తొమ్మిదవ తరగతి చదువుతున్న విద్యార్థినిని పీఈటి చితకబాదిన ఘటన ఉర్సు మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని, తండ్రి తెలిపిన వివరాల ప్రకారం..ఎంజేపీలో 9వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థినికి ఆరోగ్యం సరిగా లేదని చెబుతున్నా అవేమీ పట్టించుకోకుండా పీఈటీ రన్నింగ్ చేయించడమే కాకుండా చేయి చేసుకున్నట్లు ఆరోపించారు. గతంలో విద్యార్థినులను ఇలాగే కొడితే ప్రిన్సిపాల్‌తో పాటు ఆర్‌సీఓకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే రెండు రోజులుగా ఆ విద్యార్థినికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో శుక్రవారం తండ్రికి సమాచారం ఇవ్వగా అతడు హాస్టల్‌కు వెళ్లి విద్యార్థిని ఆస్పత్రికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఏమి జరిగిందని ఆ విద్యార్థిని అడుగగా పీఈటీ కొట్టిన విషయం చెప్పినట్లు తండ్రి తెలిపారు. ఈ విషయమై పాఠశాల ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా ఎంజేపీలో ఎవరిని కొట్టమని, ఏదైనా సమస్య ఉంటే పేరెంట్స్‌ను పిలిచి మాట్లాడుతామని చెప్పారు. పీఈటీని కూడా ఎవరిని కొట్టవద్దని ఆదేశించినట్లు తెలిపారు.

ఘనంగా 'ఏకశిల ఆస్పత్రి' వార్షికోత్సవం



వేడుకల్లో ఆస్పత్రి చైర్మన్, ఎండీ, డైరెక్టర్లు, వైద్య సిబ్బంది

హన్మకొండ చౌరస్తా: ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు అత్యాధునిక, నాణ్యత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలందించాలనే దృక్పథంతో ఆస్పత్రిని నెలకొల్పి 10 వసంతాలు దిగ్విజయంగా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందని ఆస్పత్రి చైర్మన్ కరుణాకర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని ఏకశిల ఆస్పత్రిలో 10వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం డైరెక్టర్లు, వైద్యులు, సిబ్బందితో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాకర్‌రెడ్డి కేక్ కట్ చేసి మాట్లాడారు. ఇప్పటి వరకు లక్షమందికి పైగా రోగులకు వివిధ విభాగాల్లో విజయవంతమైన చికిత్స అందించామన్నారు. వైద్య సేవలే కాకుండా పారామెడికల్ కోర్సుల ద్వారా వైద్య విద్యార్థులను అందిస్తున్నామన్నారు. ఆస్పత్రి ఎండీ.డాక్టర్ రమేష్ మాట్లాడుతూ జిల్లా ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే ప్రతి ఒక్కరికి గుర్తుకొచ్చేలా ఆస్పత్రి ఎదిగిందని చెప్పేందుకు సంతోషంగా ఉందన్నారు. గుండె సమస్యలకు ఏంజియోగ్రామ్, స్టంట్స్, బైపాస్ సర్జరీల ద్వారా మెరుగైన చికిత్స అందించడంలో మొదటి స్థానంలో నిలిచామని అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి డైరెక్టర్లు డాక్టర్లు ప్రవీణ్‌రెడ్డి, రాజీవ్ రంజన్, సుమన్, సంధ్యారాణి, ఆర్‌ఎంఓ వెంకట్ రెడ్డి, జనరల్ మేనేర్ పి.శ్రీదేవీ పాల్గొన్నారు.

ఆ అధికారినుంచి కాపాడండి

- మానసికంగా, లైంగికంగా వేధిస్తున్నాడు
- ఏఎస్‌డబ్ల్యూఓపై సీపీకి వంట మనిషి ఫిర్యాదు

వరంగల్ క్రైం: తనను మానసికంగా, లైంగికంగా వేధిస్తున్న హసన్‌పర్తి ఏఎస్‌డబ్ల్యూఓ (అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్) లక్ష్మణ్ నాయక్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఓ మహిళా అసిస్టెంట్ కుక్ శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసింది. కమలాపూర్ ఎస్సీ హాస్టల్‌లో ఏడు నెలలుగా కుక్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నానని, ఆరు నెలల నుంచి ఏఎస్‌డబ్ల్యూఓ మానసికంగా ఇబ్బంది పెడుతూ, శారీరకంగా లొంగాలని వేధిస్తున్నాడని పేర్కొంది. ప్రతినెలా నా అటెండెన్స్‌ను హసన్‌పర్తి కార్యాలయానికి తీసుకు రావాలని చెబుతూ ఆఫీస్‌నుంచి అందరూ వెళ్లే వరకు ఉంచుకునేవాడని, తాను ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకొని హాస్టల్‌కు వచ్చేదాన్నని ఫిర్యాదులో తెలిపింది. ఉదయం, సాయంత్రం రాత్రివేళ అని చూడకుండా ఫోన్ చేస్తూ 'నేను హాస్టల్‌కు వస్తున్నా, నీవు రెడీగా ఉండు' అంటూ వేధించేవాడని వాపోయింది. హాస్టల్‌కు వచ్చి కారు ఎక్కాలని బలవంతం చేస్తే తప్పించుకున్నానని పేర్కొంది. అతని బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకుందామని యత్నించి పిల్లల గురించి ఆలోచించి విరమించుకున్నానని, ఆ అధికారిపై చర్యలు తీసుకోవాలని సీపీని వేడుకుంది.

సుందరయ్యనగర్‌లో వృద్ధురాలి హత్య

- రూ.1.50 లక్షల విలువైన బంగారం అపహరణ



ఐలమ్మ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీపీ రంగనాథ్, అధికారులు

వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ సమీపంలోని సుందరయ్యనగర్‌లో జాగిలపు ఐలమ్మ(70) వృద్ధురాలిని గురువారం రాత్రి హత్య చేసి నగలను దోచుకెళ్లినట్లు ఎస్సై పోగుల శ్రీకాంత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు మండలం పెద్దాపురానికి చెందిన జాగిలపు నరహరి, ఐలమ్మలు వ్యాపార నిమిత్తం వచ్చి గతంలో వివేకానందకాలనీలో నివాసం ఉన్నారు. వ్యాపారంలో నష్టం రావడంతో సుందరయ్యనగర్‌కు వచ్చారు. మూడేళ్ల క్రితం నరహరి మృతి చెందడంతో ఐలమ్మ ఒక్కతే సుందరయ్యనగర్‌లో నివాసం ఉంటుంది. తమ వద్ద ఉండాలని కుమారుడు కోరినప్పటికి ఒంటరిగానే ఉంటోంది. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు పక్కింటి వారితో మాట్లాడిన ఐలమ్మ ఇంట్లోకి వెళ్లింది. శుక్రవారం ఉదయం ఐలమ్మ బయటకు రాకపోవడంతో పక్కనే ఉండే వారు ఇంట్లోకి వెళ్లి చూడగా చనిపోయి ఉండడంతో వెంటనే ఆమె కుమార్తెలకు, కుమారుడికి సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించామని ఎస్సై తెలిపారు. వృద్ధురాలిపై ఉన్న మూడున్నర తులాల బంగారంపై కన్నేసిన దొంగలుగా భావిస్తున్న గుర్తుతెలియని వ్యక్తులు ఈ ఘటనకు పాల్పడి ఉంటారని ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. బంగారు నగలను దోచుకునే సమయంలో గొంతు నులిమి, మూతిపై దాడి చేయడంతో పళ్లు ఇరిగి రక్తం బయటకు వచ్చిందన్నారు. పోలీసు జాగిలాలు, క్లూస్ టీంలు సంఘటనా స్థలం వద్దకు వచ్చి పరిశీలించాయని తెలిపారు. ఐలమ్మ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఇదిలా ఉండగా హత్యాస్థలం నుంచి పోలీసు జాగిలాలు నేరుగా కుటుంబ సభ్యుల్లోని ఒకరి ఇంటికి వెళ్లినట్లుగా సుందరయ్యనగర్‌లో ప్రచారం జరుగుతోంది.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీపీ

సుందరయ్యనగర్‌లో ఐలమ్మను హత్య చేసి దోపిడీ జరిగిన సంఘటన స్థలాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్ సందర్శించి పరిశీలించారు. అనంతరం నేరం జరిగిన తీరును ఆయన సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు నిందితులను త్వరగా పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో ఈస్ట్‌జోన్ డీసీపీ పి.కరుణాకర్, క్రైమ్ డీసీపీ మురళీధర్, పరకాల ఏసీపీ శివరామయ్య, ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ చేరాలు, సీసీఎస్ సీఐ రమేష్, క్లూస్ విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కేటీఆర్‌ను సీఎంగా వద్దన్నందుకే సాయన్న అంత్యక్రియలు అధికారికంగా జరుపలేదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్



హన్మకొండ: కె.తారక రామారావును సీఎం చేసేందుకు చేపట్టిన సంతకాల సేకరణలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న వ్యతిరేకించినందుకే అధికారికంగా ఆయన అంత్యక్రియలు నిర్వహించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. హనుమకొండలో శుక్రవారం రాత్రి జరిగిన స్ట్రీట్ కార్నర్ సమావేశంలో సంజయ్ మాట్లాడారు. కేటీఆర్ ఎక్కడ ఉద్యమంలో పాల్గొన్నాడు.. తామంత ఉద్యమంలో పాల్గొన్నాం.. కేటీఆర్‌ను ఎలా సీఎం చేస్తారని ప్రశ్నించి తాను సంతకం పెట్టనని చెప్పినందుకే మంత్రి కేటీఆర్‌కు కోపం వచ్చి అధికారికంగా అంత్యక్రియలు నిర్వహించలేదన్నారు. అదే విదేశాల్లో ఉన్న నిజాం ప్రభువు చనిపోతే సీఎం కేసీఆర్ టోపీ పెట్టుకుని వెళ్లి నిజాం మృతదేహం వద్ద మోకరిల్లాడని ధ్వజమెత్తారు. బండి సంజయ్ తన పేరు ఎత్తొద్దని కోర్టు నుంచి ఆదేశాలు తీసుకున్న పిరికిపంద కేటీఆర్ అని తూర్పారబట్టారు. రాష్ట్రంలో మద్యం సేవించే వ్యక్తి సీఎం, డ్రగ్స్, పత్తాల దందా, లిక్కర్ దందాలు చేసే వారు మంత్రి కావచ్చు కానీ, కార్పొరేటర్ చేసిన వ్యక్తి పార్టీ అధ్యక్షుడు కావద్దా అని ప్రశ్నించారు. అమెరికాలో చిప్పలు కడిగిన వ్యక్తి మంత్రి కావచ్చు కానీ, బండి సంజయ్ పార్టీ అధ్యక్షుడు కావద్దా అని కేటీఆర్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

ముసలమ్మకుంటలో విద్యార్థి గల్లంతు



గల్లంతైన విద్యార్థి అలీం



విద్యార్థి గల్లంతైన కుంట ఇదే..

వరంగల్ : ఏనుమాములలోని ఇందరమ్మకాలనీ సమీపంలోని ముసలమ్మకుంటలో వరంగల్ శాంతినగర్‌కు చెందిన అలీం (15) విద్యార్థి గల్లంతైనట్లు తెలిసింది. శుక్రవారం అలీంతో పాటు మరో నలుగురు స్నేహితులు కలిసి చేపలు పట్టేందుకు ముసలమ్మకుంటకు వెళ్లినట్లు తెలిసింది. ఈ క్రమంలో చేపల కోసం గాలాలు వేస్తూ చెరువులోకి వెళ్లడంతో లోతు తెలియక అలీంతో పాటు మరొకరు మునిగిపోయారు. అక్కడే ఉన్న ఒక యువకుడు మునిగిపోతున్న ఇద్దరిలో ఒకరిని రక్షించినట్లు సమాచారం. మరొకరు పూర్తిగా మునిగిపోవడంతో భయాందోళనకు గురైన మిగిలిన వారు అక్కడ నుంచి పారిపోయారు. ఈ విషయం గమనించిన స్థానికులు వాట్సాప్‌లో వైరల్ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు. ముసలమ్మకుంటలో మొరం పెద్ద మొత్తంలో తీయడంతో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. సుమారు 20 నుంచి 60 ఫీట్ల లోతు వరకు ఉంటాయని స్థానికులు తెలిపారు. పోలీసులు అగ్నిమాపకశాఖ సిబ్బంది, రెస్క్యూ సిబ్బందిని సంఘటన స్థలానికి రప్పించినప్పటికి రాత్రి కావడంతో గాలింపులను నిలిపివేశారు. కుంటవద్ద గాలం, స్కూటర్, చెప్పులను గుర్తించడంతో గల్లంతైన అబ్బాయి తన కుమారుడు అలీం అని తల్లిదండ్రులు సాజిదా, అఫ్జల్‌లు రోదిస్తూ చెప్పారు. అలీం పోచమ్మమైదాన్‌లోని మౌలాలి స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



టేకుమట్ల(రేగొండ): అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కోటంచలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోటంచకు చెందిన గుండెకారి సంతోష్(35) గతంలో ఉపాధి హామీలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించేవాడన్నారు. ప్రభుత్వం వారిని విధుల నుంచి తొలగించడంతో తనకున్న 30 గుంటల వ్యవసాయ భూమిలో పంటలను సాగు చేసుకుంటున్నాడన్నారు. గత రెండేళ్లుగా మిర్చి పంట దిగుబడి రాకపోవడంతో సుమారు రూ. ఒక లక్ష వరకు అప్పులు పెరిగాయని, దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.